## అర్జీలను పరిష్కరించడానికి తక్షణమే

# చర్యలు తీసుకోవాలి

- ప్రజా సమస్యలపై వస్తున్న అర్జీలను తక్షణమే పరిష్కరించాలి
- జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి



**బాపట్ల - నవభూమి:** జిల్లాలో ప్రజా సమస్యలపై వస్తున్న అర్జీలను తక్షణమే పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి అధికారులను ఆదేశించారు.సోమవారం స్థానిక కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదికను జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల స్థాయి అధికారులు ప్రజా సమస్యలపై వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్ లైన్ లో నమోదు చేయాలని, వాటిని పి.జి.ఆర్.ఎస్ లో నమోదు చేయాలని చెప్పారు. జిల్లాఅధికారులు సంబంధిత శాఖలపరిధిలోని పనులను పూర్తిచేయటమే కాకుండా పూర్తయినటువంటి పనుల వివరములను ఎప్పటికప్పుడు యాప్ లో నమోదు చేయాలన్నారు. పాఠశాల భవనాల మరమ్మత్తులు మరియు మౌలిక వసతులు అన్నీ కూడా పూర్తి చేయుటకు ప్రతిపాదనలు పంపాలన్నారు. ప్రభుత్వం అధికారులకు ఇచ్చిన లక్ష్యాలను నిర్దేశ సమయములోగా పూర్తి చేయాలన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు అర్జీల ద్వారా తమ సమస్యలు పరిష్కరించాలంటూ కలెక్టర్ కు విన్నవించారు. ప్రభుత్వ పరిధిలో చేయదగినవి ఆయన తక్షణమే పరిష్కార మార్గం చూపారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుండి ప్రజా సమస్యలపై వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులు సూచించారు. జిల్లాలో 0 నుండి 5 సంవత్సరాలలోపు వయసుగల పిల్లలందరికి ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రంలో నమోదు చేయాలని ఆయన చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుండి వివిధ సమస్యలపై 105 అర్జీలు వచ్చాయని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి. గంగాధర్ గౌడ్, డి.ఆర్.డి.ఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ పద్మావతి, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయలక్ష్మి, గృహనిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు , ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాసరావు,జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి రాజ్ దిబోరా, జిల్లామహిళా శిశు సంక్షేమ అధికారి ఉమా, గుంటూరు, జిల్లా పరిషత్ డిప్యూటీవ్ సి.ఇ. ఓ కృష్ణా,జిల్లా పౌర సరఫరాల అధికారి విలిమ్స్, గనుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాజేష్ కుమార్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అర్జీలు పునరావృతం కాకుండా

# శాశ్వత పరిష్కారం చూపాలి

**బాపట్ల - నవభూమి :** అర్జీలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడి పోలీస్ అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ నిర్వహించారు. తమ సమస్యలను వెల్లబుచ్చుకోవడానికి జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చిన అర్జీదారుల సమస్యలను ఎస్పీ స్వయంగా విని, వారు ఇచ్చిన అర్జీలను పరిశీలించారు. సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్లో మాట్లాడి అర్జీదారుల సమస్యలను చట్ట పరిధిలో విచారించి నిర్ణిత గడువులోగా పరిష్కారం చూపాలన్నారు. వివిధ సమస్యలతో పోలీస్ కార్యాలయాలకు వచ్చే బాధితులకు భరోసాగా పోలీస్ శాఖ ఉండాలన్నారు. వారి సమస్యలను చట్ట పరిధిలో విచారించి పరిష్కారం చూపాలన్నారు. అర్జీలు మరల మరల పునరావృతం కాకుండా పూర్తి స్థాయిలో విచారించి శాశ్వతంగా పరిష్కారం చూపాలని ఎస్పీ పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కుటుంబ కలహాలు, అత్తారింటి వేధింపులు, ఆస్థి తగాదాలు, భూ వివాదాలు, ఆర్థిక లావాదేవీ మోసాలు, ఇతర పలు సమస్యలతో మొత్తం 37 మంది అర్జీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్, పి.జి.ఆర్.ఎస్ ఇంచార్జ్ సీఐ శ్రీనివాసరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.






## నర్సీపట్నంలో జరిగే సిపిఎం పార్టీ 24వ జిల్లా మహాసభలు

# జయప్రదం చేయండి

మండల కార్యదర్శి ఇరట నరసింహామూర్తి




**మాడుగుల డిసెంబర్ 9 నవభూమి** మండలం కేంద్రం మాడుగుల లో స్థానిక బస్ కాంప్లెక్స్ వద్ద ఈనెల 20 నుంచి 22 వరకు నర్సీపట్నంలో జరిగే సిపిఎం పార్టీ 24 వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పోస్టర్ ఆవిష్కరణ చేశారు.ఈ సందర్భంగా మండల కార్యదర్శి ఇరట నరసింహ మూర్తి మాట్లాడుతూ ఈనెల 20,21,22 తేదీలలో నర్సీపట్నంలో జరుగుతున్న సిపిఎం అనకాపల్లి జిల్లా 24 వ జిల్లా మహాసభలు మూడు సంవత్సరాల కు ఒక్కసారి జరిగే ఈ మహాసభలను జయప్రదం కోసం ప్రజలు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ మహా సభల్లో నూతనంగా ఏర్పడ్డ అనకాపల్లి జిల్లాను సమగ్ర అభివృద్ధి చేయాలని షుగర్ ఫ్యాక్టరీలను అదునీకరించి తెరిపించాలని , జీడి పంటకు మద్దతు ధర ఇచ్చి ప్రభుత్వమే రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలన్నారు.నాన్ షెడ్యూల్ గిరిజన గ్రామాలను ఐదవ షెడ్యూల్ లో చేర్చాలని , ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని పారిశ్రామిక ప్రాంతంలో పరిశ్రమల్లో ప్రమాదాలు అరికట్టాలని స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని విశాఖ డైరీ జరిగిన అవినీతిపై సమగ్ర దర్యాప్తు జరపాలని తగ్గించిన పాల ధరను వెంటనే పెంచాలని విద్యుత్ చార్జీలు వెంటనే తగ్గించాలని స్మార్ట్ మీటర్ల బిగింపు ను వెంటనే ఆపాలని యువతి యువకులకు స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లు ఏర్పాటు చేయాలని ధాన్యం కొనుగోలు కేంద్రాలు విస్తారంగా పెట్టి మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేయాలని , ఎన్నికల ముందు అంగన్వాడీ , ఆశ మధ్యన భోజన కార్మికులకు ఐకెపి అన్ని రకాల స్కీం వర్కర్లకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని , జిల్లాలోని భూ కుంభకోణాలపై దర్యాప్తు జరపాలని , పేదలు సాగులో ఉన్న పోడు ఫారెస్ట్ భూములకు బంజరు భూముల కు సీలింగ్ భూములు కు పట్టాలు ఇవ్వాలని వృత్తి దారులకు రక్షణ కల్పించి రుణాలు మంజూరు చేయాలని , ఉద్యోగ ఉపాధ్యాయ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని , కార్మిక సమస్యలపై ఈ మూడు రోజులు చర్చించి భవిష్యత్తులో పోరాటాలకు పిలుపునివ్వడం అనేక తీర్మానాలు చేయడం జరుగుతుందని తెలిపారు.జిల్లాలోని 24 మండలాల నుండి 500 మంది ప్రతినిధులు రాష్ట్ర నాయకులు ఈ మహాసభలకు హాజరవుతారని చెప్పారు.ఈ మహాసభలను విజయవంతం కోసం ప్రజలు అన్ని రకాల సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకురాలు కె.భవాని , ఎస్. ఘాటీలు ,పి.జగన్నాధరావు,ఎం.అప్పారావు, వి.అయ్యప్ప ,సిహెచ్.సత్య నారాయణ.కే.నూకరాజు. తదితరులు పాల్గొన్నారు.



## గోపన్నపాలెంలో సెయింట్ ఫ్రాన్సిస్ గ్లోబల్ స్కూల్ ప్రారంభం

## ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా బొర్రాగోపి మూర్తి విజయం



**దెందులూరు డిసెంబర్ 9 నవభూమి** ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా బొర్రా గోపి మూర్తి విజయం సాధించారు ఈ విజయంపై ఆంధ్రప్రదేశ్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవల జరిగిన తూర్పు పశ్చిమ-ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో ఘన విజయం సాధించిన గోపి మూర్తికి ఆంధ్రప్రదేశ్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జి జె ఏ.స్టీవెన్, ఏలూరు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గోపన్నపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న మాసగిరి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో హర్షం వెలిబుచ్చారు. ఉపాధ్యాయ ఉద్యమ నాయకునిగా అనేక సమస్యల మీద రాజీ లేని పోరాటం చేసి, ఉపాధ్యాయుల హక్కుల కోసం నిరంతరం పాటుపడుతూ, హక్కుల సాధన కోసం పోరాటాలే మార్గమంటూ ముందుకి సాగుతున్న గోపి మూర్తి యొక్క సేవలను గుర్తించిన ఉపాధ్యాయులు ఆయనవిజయంలో కీలక పాత్ర పోషించారని, శాసన మండలిలో గోపి మూర్తి ఉపాధ్యాయ గొంతుకై నిలవాలని, ఈ సందర్భంగా ఆకాంక్షించారు. మండలంలోని గోపన్నపాలెం దెందులూరు కొవ్వలి పోతునూరు పలు పాఠశాల ఉపాధ్యాయులు వర్షం వ్యక్తం చేశారు

## రైతుల గోకుల షెడ్డు పశువుల సమస్యలు పరిష్కరించండి

**కోసిగి డిసెంబర్9 (నవభూమి)** కోసిగి సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో రైతుల గోకుల షెడ్డు పశువుల సమస్యల ను పరిష్కరించాలని కోసిగి వెటర్నరి అసిస్టెంట్ డైరెక్టర్ బ్రహ్మయ్య వినతిపత్రం ఇవ్వడం జరిగింది ఈ సమస్యల పైన సిపిఐ మండల కార్యదర్శి మంత్రాలయం తాలూకా రైతు సంఘం తాలూకా అధ్యక్షులు ఎం గోపాల్ డిహెచ్పిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి హెచ్ ఓంకార్ స్వామి లు మాట్లాడుతూ గత 2014 సంవత్సరంలో అధికారంలో ఉన్న తెలుగుదేశం ప్రభుత్వంలో చాలామంది పశువులు ఉన్న రైతులు గోకుల షెడ్డు నిర్మించుకోవడం జరిగింది. ఆ రైతులకే బిల్లులు కూడా ఇవ్వలేదని అన్నారు. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం మే అధికారంలోకి వచ్చిందని ఇదే సమస్యల పైన ప్రభుత్వం రెండవసారి పశువులు ఉన్న రైతులకి గవర్నమెంట్ మళ్లీ ఆశ చూపిస్తున్నారని వారు అన్నారు. ఇంతకుముందు కట్టిన వాటికే బిల్లులు రాలేదని ,మళ్లి ఇప్పుడు కట్టుకున్న తర్వాత బిల్లులు రాలేక పోతే రైతులు తీవ్ర ఇబ్బందికి గురవుతారన్నారు. కావున పెండింగ్లో ఉన్న బిల్లులు చేసిన తర్వాతే కొత్తవి నిర్మించాలని వారు డిమాండ్ చేశారు . కోసిగి మండలంలో ఊరువాడ వదిలి ప్రజలు కూలీలు వలసకు వెళుతున్నారని ఇలాంటి వాళ్ళకి ప్రభుత్వం నుండి గేదెలు గొర్రెలు పూర్తి సబ్సిడీ కింద మంజూరు చేయాలని పశువులు ఉన్న ప్రతి రైతులు దగ్గరికి వెటర్నెట్ డాక్టర్ పశువులకి వైద్యము అందించాలని అదేవిధంగా ప్రభుత్వం తరఫున వచ్చిన మందులు సకాలంలో సరఫరా చేయాలని గేదెలు పశువులు గొర్రెలు ఉన్న రైతుల దగ్గరికి వెళ్లి ఉచితంగా బీమా ఇన్సూరెన్స్ చేపించాలని సిపిఐ పార్టీ డిమాండ్ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో రైతులు థామస్ శ్రీనివాసులు మహాదేవ్ తదితరులు పాల్గొనడం జరిగింది.



### గోపన్నపాలెంలో సెయింట్ ఫ్రాన్సిస్

# గ్లోబల్ స్కూల్ ప్రారంభం

◆ ప్రారంభించిన ఎమ్మెల్యే కుమార్తె చింతమనేని నవ్యమ్మ.మండల టీడీపీ అధ్యక్షుడు మాగంటి







**దెందులూరు.డిసెంబర్ 9 నవభూమి** గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన నూతన టెక్నాలజీ తో విద్యావ్యాప్తికి అన్ని అత్యాధునిక విధానంతో డిజిటల్ సాంకేతిక తో పాఠశాలలను నిర్మించి ప్రారంభం చేయడం చాలా ఆనందంగా ఉందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కుమార్తె చింతమనేని నవ్యమ్మ.ఏలూరు ఆర్ సీఎం పీఠాధిపతి బిషప్ పొలిమేర జయరావు అన్నారు. మండలంలోని గోపన్నపాలెం గ్రామపంచాయతీ పరిధిలోని సెయింట్ ఫ్రాన్సిస్ గ్లోబల్ స్కూల్ ను దెందులూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మాగంటి నారాయణ ప్రసాద్ మిల్లు బాబు.చింతమనేని నవ్యమ్మ. సెయింట్ ఫ్రాన్సిస్ గ్లోబల్ స్కూల్ కరెస్పాండెంట్ బ్రదర్ జోసఫ్ కుమార్ లతో కలిసి సెయింట్ ఫ్రాన్సిస్ గ్లోబల్ స్కూల్ ను ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని ఎక్కడా లేని విధంగా ఐ. సి. ఎస్ .ఈ సిలబస్ తో నర్సరీ నుండి మూడో తరగతి వరకు అత్యంత ఆధునిక. ఆకర్షణీయమైన నూతన భవనాలను ఏర్పాటు చేసి పాఠశాలతో పాటు మంచి టాలెంట్ అత్యంత ప్రతిభ కలిగిన ఉపాధ్యాయులతో సెయింట్ ఫ్రాన్సిస్ గ్లోబల్ స్కూలు నిర్వహిస్తున్నామని ప్రారంభోత్సవానికి దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ కుమార్తె నవ్యమ్మ దెందులూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మాగంటి నారాయణ ప్రసాద్ (మిల్లు బాబు). రావడం చాలా ఆనందంగా ఉందని అన్నారు.సెయింట్ ఫ్రాన్సిస్ గ్లోబల్ స్కూల్ సంస్థల ప్రొవెన్షియల్ బ్రదర్ అలెగ్జాండర్. వైస్ ప్రొవెన్షియల్ బ్రదర్ టైటాస్. కౌన్సిల్స్ మర్యాదాసు జోసఫ్ పిటి. పౌల్ డీజోజా లు డిజిటల్ రూమ్ లను ప్రారంభోత్సవం చేశారు.గోపన్నపాలెం గ్రామం తో పాటు శివారు గ్రామాల ప్రజ లు నూతన స్కూల్ ను సద్వినియోగం చేసుకుని విద్య వ్యాప్తికి కృషి చేయాలని బ్రదర్ జోసఫ్ కుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో గోపన్నపాలెం గ్రామం మాజీ సర్పంచ్ మరియు దెందులూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మాగంటి నారాయణ ప్రసాద్ (మిల్లు బాబు) గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చింతా సుబ్బారావు. మాజీ ఉపసర్పంచ్ మారగాని సత్యనారాయణ. టిడిపి నేత ఏనుగు కేబుల్ శీను. బజారు గణేషు. జనసేన నాయకులు గోపన పాలెం గ్రామం మాజీ సర్పంచ్ కొండేటి హనుమంతు. తెలుగు యువత నాయకులు బొర్రా చందు. క్రైస్తవ సంఘం నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

### నారాయణరెడ్డిపేట జడ్పీహెచ్ఎస్‌లో ఘనంగా

# మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్

**నెల్లూరు,డిసెంబర్ 7,(నవభూమి)::** రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ కార్యక్రమాన్ని నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలోని 1వ డివిజన్ ప్రాంతంలో ఉన్న నారాయణరెడ్డి పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని.. నారాయణరెడ్డి పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నజీర్ అహ్మద్,1వ డివిజన్ కార్పొరేటర్ జానా నాగరాజు,స్కూల్ కమిటీ చైర్మన్ గోవింద్,జిల్లా రైతు సంఘం నాయకులు షానవాజ్, తెలుగుదేశం పార్టీ నెల్లూరు నగర అధ్యక్షులు చిరంజీవి, దేవస్థానం చైర్మన్ జాన పెంచల నరసింహం,కన్న బ్రహ్మయ్య,ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులతో కలిసి తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు.విద్యార్థిని, విద్యార్థుల తల్లిదండ్రులకు ముగ్గుల పోటీలు,పలు ఆటల పోటీలు నిర్వహించి.. ఈ ఆటలలో గెలుపు పొందిన తల్లిదండ్రులకు బహుమతులను అందజేశారు.విద్యార్థిని,విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి.ఈ సందర్భంగా స్కూల్ కమిటీ చైర్మన్ గోవింద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ ను ఘనంగా నిర్వహించామన్నారు.విద్యార్థిని, విద్యార్థుల తల్లిదండ్రులు అందరూ కలిసి ఉపాధ్యాయులతో కలిసే విధంగా మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.ఈ స్కూల్లో చదువుకొని స్థిరపడ్డ పూర్వ విద్యార్థులు,దాతలు ముందుకొచ్చి.. స్కూల్ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు.మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్లో పాల్గొని.. విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు,విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు, పాల్గొన్నారు





## మండూరు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా సోనియాగాంధీ జన్మదిన వేడుకలు

### దెందులూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ ఇంచార్జ్ ఆలపాటి నరసింహామూర్తి



**దెందులూరు డిసెంబర్ 9 నవభూమి** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు. దేశ అభివృద్ధి సంక్షేమం తప్ప అధికార అకాంక్ష గాని పదవి అకాంక్ష గాని లేని నిజమైన నిజాయితీ కలిగిన నాయకురాలు.ఏఐసీసీ మాజీ అధ్యక్షురాలు పార్లమెంట్ సభ్యురాలు శ్రీమతి సోనియా గాంధీ 78వ జన్మదిన వేడుకలు ఏలూరు జిల్లా దెందులూరు నియోజకవర్గం పార్టీ కార్యాలయం మండూరులో ని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ దెందులూరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జ్ కన్వీనర్ ఆలపాటి నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు ఈ సందర్భంగా ఆలపాటి నరసింహమూర్తి మాట్లాడుతూ శ్రీమతి సోనియా గాంధీ భర్త మాజీ ప్రధాని రాజీవ్ మరణాంతరం పార్టీని తన భుజస్కందాలపై వేసుకొని తిరిగి పార్టీని కేంద్రంలో అధికారంలోకితీసుకువచ్చి న వీరవనిత అని పార్టీని అధికారంలో తీసుకువచ్చిన ప్రధానమంత్రి పదవి తీసుకోకుండా తను గాని తన కుమారుడు రాహుల్ గాంధీని గాని దూరంగా ఉంచి ప్రధానమంత్రిగా ఆనాడు పది సంవత్సరాలు మన్మోహన్ సింగ్ ను కొనసాగించి పదవీకాంక్షలేనీ రాజకీయ నాయకురాలుగా ఖ్యాతి గడిచిందని భవిష్యత్తులో భగవంతుడు ఆవిడకి ఆరోగ్యంగా ఉండాలని పార్టీకి దేశానికి తగు సూచనలు ఇవ్వాలని ఆలపాటి నరసింహమూర్తి ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో దెందులూరు నియోజకవర్గం యువజన విభాగం యువత అధ్యక్షులు ఆలపాటి వి ఆర్ చౌదరి లతో కలిసి ఆలపాటి నరసింహమూర్తి సోనియా గాంధీ జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేసి పేదలకు పండ్లు రొట్టెలను పంపిణీ చేశారు. తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## గుంటూరులో 15న జరిగే మాలల సింహ గర్జన జయప్రదం చేయండి

**ఉప్పలగుప్తం (నవభూమి)** మాల జాతి ఐక్యతకై మాలల సమస్యలు పరిష్కారం కొరకు రాజ్యాంగ విరుద్ధమైన ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఈనెల 15వ తేదీన వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి అఖిలభారత మాల సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గుంటూరులో జరుగుతున్న మాలల సింహ గర్జనను జయప్రదం చేయాలని వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా కార్యదర్శి ఇసుకపట్ల రఘుబాబు పిలుపునిచ్చారు సోమవారం ఎస్ యానం వేదాంత కంపెనీ మాల ఉద్యోగుల సమావేశం జరిగింది సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రఘుబాబు మాట్లాడుతూ దళితుల ఐక్యతను దెబ్బతీసేందుకు పాలక పార్టీలన్నీ వర్గీకరణ పేరుతో మాల మాదిగలను విడదీస్తున్నాయని ఇది రాజ్యాంగ విరుద్ధమని వర్గీకరణకు వ్యతిరేకంగా మాలలంతా ఐక్యంగా ఉద్యమించాలని అందుకు ఈ నెల 15వ తేదీన మాలల సింహగర్జనను జయప్రదం చేయాలని కోరారు అనంతరం మాలల సింహగర్జన గోడపత్రికను ఆవిష్కరించారు ఈ కార్యక్రమంలో పాలమూరు మోహన్ బాబు రేవు తిరుపతిరావు పెట్ట మురళీకృష్ణ పాలమూరి కాటయ్య ముక్తా బత్తుల శ్రీను దారా షీలా జొన్నాడ మహాలక్ష్మి దారా ప్రసన్న నూకపై సత్యనారాయణ కాశి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు



### అర్బన్ నియోజకవర్గంలో సభ్యత్వాల నమోదు కోసం

# పెద్ద ఎత్తున ఆర్థిక సాయం

- లక్ష రూపాయలు అందించిన మాజీ కార్పొరేటర్ బల్లా పల్లవి
- రూ.50వేల అందించిన 9వ డివిజన్ సాకే రామాంజినేయులు
- ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కు విరాళాలు అందించిన నాయకులు



**అనంతపురం డిసెంబర్ 09 నవభూమి** అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కోసం పెద్ద ఎత్తున విరాళాలు అందుతున్నాయి. పేద కార్యకర్తల మీద భారం పడకూడదన్న కారణంతో పలువురు నాయకులు విరాళాలు అందిస్తున్నారు. తాజాగా మాజీ కార్పొరేటర్ బల్లా పల్లవి లక్ష రూపాయలు విరాళాన్ని ఎమ్మెల్యే దగ్గుపాటికి అందజేశారు. అలాగే తొమ్మిదవ డివిజన్ కు చెందిన సాకే రామాంజనేయులు 50వేల రూపాయలు విరాళం ఇచ్చారు. అనంతపురం అర్బన్ కార్యాలయంలో నాయకులు ఈ విరాళాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి వారిని అభినందించారు. పార్టీ సభ్యత్వాల నమోదులో నాయకులు మరింత చురుగ్గా పనిచేయాలన్నారు. కాలనీలో ఎవరైనా పేదవారు ఉంటే వారికి సభ్యత్వాలు నమోదు చేయించే బాధ్యత కూడా తీసుకుంటే బాగుంటుందన్నారు. కొన్ని డివిజన్ల లో ఇంకా సభ్యత్వాలు నమోదు తక్కువగా ఉందని.. వారంతా ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. పార్టీ అధిష్టానం ఎంతో నమ్మకంతో మనపై బాధ్యత ఉంచిందన్నారు. కాబట్టి ఎవరూ దీనిని నిర్లక్ష్యం చేయవద్దని ఎమ్మెల్యే దగ్గుపాటి సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకుడు గంగారామ్, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి సరిపూటి రమణ, తెలుగు యువత నాయకులు నెట్టెం బాలకృష్ణ, టిడిపి నాయకులు ఈడిగ నాగభూషణం, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కడియాల కొండన్న, కృష్ణమోహన్ నాయుడు, రాజప్ప, లక్ష్మీనారాయణ రెడ్డి, కంతా దేవి, సుధాకర్, విజయ్ కుమార్, సాకె మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# బస్సు సర్వీసుల సంఖ్య పెంచండి

- ఆర్టీసీ ఎం.డికి కాలవ వినతి



**అనంతపురం డిసెంబర్ 09 నవభూమి** కర్ణాటక సరిహద్దులోని రాయదుర్గం నియోజకవర్గం నుంచి ఆర్టీసీ సర్వీసుల సంఖ్య పెంచాల్సిన అవసరం ఉందని ప్రభుత్వ విప్ స్థానిక ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఆర్టీసీ ఎమ్.డీ , రాష్ట్ర డీజీపీ ద్వారక తిరుమల రావుకు విజ్ఞప్తి చేశారు. సోమవారం సాయంత్రం విజయవాడ నగరంలోని డీజీపీ క్యాంపు కార్యాలయంలో తిరుమల రావును కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ముఖ్యంగా కర్ణాటక- ఆంధ్ర అంతరాష్ట్ర సర్వీసుల విషయంలో ఇరు రాష్ట్రాల మధ్య కుదరాల్సిన ఒప్పందంలో తీవ్ర జాప్యం జరుగుతోందని, దీన్ని సత్వరం పూర్తి చేయాలని కోరారు. రెండు రాష్ట్రాల మధ్య ఒప్పందం పూర్తయితే చాలా బస్సు సర్వీసులు కర్ణాటక, ఆంధ్రాల మధ్య తిరిగి ప్రారంభయ్యే అవకాశాలు ఉంటాయని ఆయన ఆర్టీసీ ఎం.డికి వివరించారు.రాయదుర్గం కర్ణాటక సరిహద్దులో ఉన్నందున ఇక్కడి నుండి ఎక్కువ మంది ప్రయాణికులు పక్క రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు వెళ్తుంటారన్నారు. అయితే గతంలో ఉన్న పలు సర్వీసులను ఇటీవల కాలంలో రద్దు చేసిన కారణంగా చాలా మంది ప్రయాణికులు తీవ్ర అసౌకర్యాలకు లోనవుతున్నారని ఆయన ఆందోళన చెందారు. ఈ నేపథ్యంలో రద్దు చేసిన సర్వీసులను తిరిగి పునరుద్ధరించాల్సిన అవసరం ఉందన్నారు. రాయదుర్గం డిపో నుంచి గతంలో నడిపిన రెండు కర్నూల్ సర్వీసులు నెం. %దీూఖ3, దీూఖ%4 లను పునరుద్దరించాలని తెలిపారు. రాయదుర్గం నుంచి ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలైన ధర్మస్థలం, మంత్రాలయం, కూడ్లిగి సర్వీసులను ప్రారంభించాల్సిన ఆవశ్యకత ఎంతైన ఉందన్నారు. బెంగళూరు నగరంలో చాలా మంది ఈ ప్రాంత వాసులు వివిధ వృత్తి, ఉద్యోగాలలో స్థిరపడ్డారని పేర్కొన్నారు. కాబట్టి ప్రతి రోజు రాయదుర్గం నుంచి బెంగళూరుకు ఎక్కువ సర్వీసులు నడపడం ద్వారా సదరు ప్రయాణికులకు ఎంతో మేలు కలుగుతుందని, అలాగే ఆర్టీసీకి ఆదాయం కూడా పెరుగుతుందని కాలవ శ్రీనివాసులు స్పష్టం చేశారు.ఈ రాయదుర్గం డిపో నుంచి ప్రస్తుతం నడుపుతున్న బస్సు సర్వీసులను ఏ ఒక్కటి రద్దు చేయకుండా మరిన్నీ అదనపు సర్వీసులను ప్రారంభిస్తే ఏంతో అనుకూలత ఏర్పడుతుందన్నారు. కాబట్టి సదరు విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోని రాయదుర్గం డిపో అభివృద్ధికి తగిన ఆదేశాలు ఇవ్వాలన్నారు.రాష్ట్రంలోని నెల్లూరు, నంద్యాల,ఒంగోలు పట్టణాలకు ప్రతి రోజు సాయంత్రం వేళల్లో బస్సు సర్వీసులు నడపాల్సిన అవసరం ఉందన్నారు. నియోజకవర్గంలోని చాలా గ్రామాలకు నేటికి బస్సు సౌకర్యం లేక ప్రజలు ముఖ్యంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. వారి కోసం ప్రతి గ్రామానికి బస్సు సర్వీసు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రాయదుర్గం బస్టాండ్ నిర్మాణం జరిగి చాలా కాలమైనందు వల్ల పై కప్పు ఉడిపోయే ప్రమాదం ఉందన్నారు. కావున ప్రయాణికుల సౌకర్యార్థం కొత్త బస్టాండ్ నిర్మాణం లేదా పూర్తి స్థాయిలో మరమ్మత్తు చేయాల్సిందిగా కాలవ శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు.

# ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డు మెరుగుపరచాలి

**మాడుగుల డిసెంబర్ 9 నవభూమి** నియోజక వర్గ కేంద్రం మాడుగుల లో నిరుపయోగం లో ఉన్న ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డు మెరుగుపరచాలని స్థానిక యువత పంచాయితీ కి విజ్ఞప్తి చేశారు.ఈ మేరకు సోమవారం గ్రామ సర్పంచ్ ఎడ్ల కళావతి మరియు పంచాయితీ కార్యదర్శి మూర్తి బాబు కి వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామం లో ఆర్టీసీ కాంప్లెక్స్ కి సరైన రోడ్డు లేకపోవడం వలన అక్కడకు బస్సులు వెళ్ళక నిరుపయోగంగా ఉందని అన్నారు.అందుకే ఆ రోడ్డు ను మెరుగు పరచాలని కోరారు.పంచాయితీ వారు తక్షణమే ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డు ను మెరుగుపరచాలని తెలిపారు.రోడ్డు మెరుగుపరచడం ద్వారా బస్సులు రాకపోకలు సాగించే అవకాశం ఉందని వారు తెలిపారు.



## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే బండారు శ్రావణి



**అనంతపురం డిసెంబర్ 09 నవభూమి** శింగనమలనియోజకవర్గము :బుక్కరాయసముద్రం మండల కేంద్రం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ను నియోజకవర్గ ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ తనిఖీ చేశారు. ప్రతి నెల 9వ తేదీన ప్రధాన్ మంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ పథకం కింద గర్భిణీ స్త్రీలకు అందించే భోజన పథకాన్ని గత ప్రభుత్వం నిలిపివేయడంతో కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయినా వెంటనే స్వచ్ఛందంగా పసుపుల బ్రదర్స్ వారి సహకారంతో ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ బుక్కరాయసముద్రం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతి నెల 9వ తేదీన గర్భిణీ స్త్రీలకు భోజనం వసతి తిరిగి ప్రారంభించారు. గర్భిణీ స్త్రీలకు భోజనం వడ్డించి వారితో కలిసి భోజనం చేశారు.ఆసుపత్రిలో కమిటీ హాల్ ఏర్పాటు చేయాలని సిబ్బంది కోరగా ఆస్పత్రిలోని ఖాళీ స్థలాలను పరిశీలించి కమిటీ హాల్ ఏర్పాటుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల కు వైద్యసేవలు అందించే విషయంలో చాలా ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతున్నదని తెలిపారు. గతంలో కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు ఉమ్మడి అనంతపురం జిల్లాలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ఏర్పాటు చేసి,ఖరీదైన వైద్య సేవలు ఉచితంగా అందించడం జరిగిందని తెలిపారు. రోగులకు వైద్యం అందించే విషయంలో ఎక్కడ నిర్లక్ష్యం వహించరాదని ఆసుపత్రిలోనివైద్యులను,అధికారులను కోరారు.

## మానవత్వాన్ని చాటుకున్న మాతా రమాబాయి అంబేద్కర్ ఫౌండేషన్

**ఆమలాపురం రూరల్ ( నవభూమి)** అయినవిల్లి మండలం చింతన లంక గ్రామంలో ఇళ్ళు కాలిపోయి నిరాశ్రయులైన ఆరు బాధిత కుటుంబాలను మాతా రమాబాయి అంబేద్కర్ ఫౌండేషన్ చైర్మన్ పుణ్యమంతుల రజిని ఆధ్వర్యంలో సభ్యులు కలిసి తాళ్ల సుబ్బలక్ష్మి కుమార్తె మోతా దుర్గాదేవి సమకూర్చిన దుప్పట్లు, తువాళ్ళు, చీరలు మరియు నిత్యవసర వస్తువులుబాధిత కుటుంబాలకు పంపిణీ చేయడం జరిగింది ఈ సందర్భంగా ప్రమాదం జరిగిన సంఘటన గురించి ఫౌండేషన్ చైర్మన్ శ్రీమతి పుణ్యమంతుల రజిని బాధిత కుటుంబాన్ని అడిగి తెలుసుకున్నారు తమ ఫౌండేషన్ ద్వారా ఆపదలో ఉన్న ఎన్నో కుటుంబాలకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తున్నామని ఈ సందర్భంగా ఆమె మీడియాకు వివరించారు ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు తాళ్ల సుబ్బలక్ష్మి, తాళ్ల లలితఎంపీటీసీ సభ్యులు తాళ్ల పద్మ , జనిపెల్ల సీతారత్నం ,దోనిపాటి మరియమ్మ, తాళ్ల బేబీ తదితరులు పాల్గొన్నారు.






# కేంద్ర రైల్వే మంత్రిని కలిసిన

## పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ

**అనంతపురం డిసెంబర్ 09 నవభూమి** అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ తన పార్లమెంట్ పరిధిలో ఉన్నటువంటి అనేక రైల్వే సమస్యలను సంబంధిత మంత్రికివివరించారు.ముఖ్యంగా అనంతపురం,రాయదుర్గం, గుత్తి హిందూపురం పట్టణాలకు సంబంధించి రైల్వే సమస్యలను తెలియజేశారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించి,వీలైనంత త్వరగా పరిష్కారం చేస్తామని తెలియజేశారుఅనంతపురం:రాజధాని ఎక్స్ప్రెస్, యశ్వంతపూర్ - బీదర్ ఎక్స్ప్రెస్, యశ్వంతపూర్ - లాతూర్ ఎక్స్ప్రెస్ లను అనంతపురం నందు నిలపాలని కోరారు.రాయదుర్గం టాటా నగర్ - యశ్వంత్పూర్ ఎక్స్ప్రెస్, మైసూర్ -వారణాసి ఎక్స్ప్రెస్, యశ్వంతపూర్- జైపూర్, తిరుపతి- దోడహల్లి ఎక్స్ప్రెస్ లో రాయదుర్గం నందు నిలపాలని కోరారు.గుత్తి,సంపత్ క్రాంతి ఎక్స్ప్రెస్, కంగు ఎక్స్ప్రెస్, మచిలీపట్నం ఎక్స్ప్రెస్ రాయల్ చెరువులో నిలవాలని కోరుతున్నారు.హిందూపూర్:వందే భారత్, రాజధాని ఎక్స్ప్రెస్ హిందూపూర్ లో నిలిపాలని ప్రజల కోరిక మేరకు అడగడం జరిగింది.అండర్పాస్:గుంతకల్లు అనంతపురం నగరాలలో వివిధ చోట్ల అండర్పాస్లు నిర్మించాలని కోరారు.ట్రైన్లు కొనసాగింపు :కొండవీడు ఎక్స్ప్రెస్ - ధర్మవరం నుంచి యశ్వంతపూర్ వరకు, మచిలీపట్నం ఎక్స్ప్రెస్- ధర్మవరం నుంచి హిందూపూర్ వరకు,నర్సాపూర్ ఎక్స్ప్రెస్ - ధర్మవరం నుంచి అనంతపురం వరకు, హౌరా ఎక్స్ప్రెస్ - గుత్తి నుంచి గుంతకల్ వరకు కొనసాగించాలని ఎంపీ తెలియజేశారు.మైసూర్ టు జైపూర్ ఎక్స్ప్రెస్ వారానికి రెండు మూడు రోజులు నడవాలని, యశ్వంత్పూర్ టు జైపూర్ వారానికి మూడు రోజులు నడపాలని కోరారు.ప్యాసింజర్ రైళ్లు :హిందూపురం టు బెంగళూరు ట్రైన్ నందు టాయిలెట్ సౌకర్యం కల్పించే విధంగా చూడాలని, తిరుపతి టు కదిరి దేవరపల్లి రైలు ని తిరిగి ప్రారంభించాలని , గుంతకల్ టు చిక్ జార్జూర్ రోజు నడపాలని కోరినారు.రైల్వే ప్రయాణికుల కొరకు సేవలు ఏర్పాటు అనంతపురం హిందూపూర్ లో లిఫ్ట్ ఏర్పాటు చేయాలని,2.అవసరమైన రైల్వేస్టేషన్లో కోచ్ డిస్ప్లే బోర్డ్స్ ఏర్పాటు చేయాలని,అవసరమైన చోట్ల ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని, అన్ని రైల్వేస్టేషన్లో అవసరమైన చోట టాయిలెట్స్ నిర్మించడం, సక్రమంగా నిర్వహించాలని,అన్ని రైల్వే స్టేషన్ నందు ఉచిత మంచి నీరు అందుబాటులో పెట్టాలని సిట్టింగ్ ఫెసిలిటీస్, క్యాంటీన్, లైట్లు ఏర్పాటు, ప్లాట్ ఫామ్ ఏర్పాటు చేయాలని, ఫస్ట్ ఎయిడ్ అందుబాటులో ఉంచాలని ప్రయాణికుల భద్రత కు చర్యలు తీసుకోవాలని, రైల్వే విభాగంలో ఏవైనా అవసరం నిమిత్తము ఉన్న రిపేర్లు సరైన సమయంలో పూర్తి చేయాలని,ఇలా అనేక రైలు సమస్యలను మంత్రిగారి దృష్టికి తీసుకెళ్లి , వీలైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా రైల్వే అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ గ కోరడం జరిగింది.



### ప్రారంభించింది మేమే...

# ప్రారంభోత్సవం చేసేది మేమే

## బాపట్ల ఎమ్మెల్యే నరేంద్ర వర్మ

**బాపట్ల - నవ భూమి:** బాపట్ల పురపాలక సంఘ ఉన్నత పాఠశాల పరిధిలోని అదనపు తరగతి గదుల కోసం తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే భవనాల నిర్మాణం ప్రారంభించడం జరిగిందని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. నాడు నేడు కింద వీటిని అభివృద్ధి చేశామని మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొనటం ఆశ్చర్యకరంగా ఉందన్నారు. ఆ కట్టడాలను మేమే ప్రారంభించాం,మళ్లీ మేమే తిరిగి ప్రారంభోత్సవం చేస్తాం. ఇందులో ఏమాత్రం సందేహం లేదని ఎమ్మెల్యే నరేంద్ర వర్మ అన్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం దీనికోసం 40 లక్షలు కేటాయించిందని, సంబంధిత కాంట్రాక్టర్లకు ఆ బిల్లులు కూడా చెల్లించలేదని నరేంద్ర వర్మ అన్నారు. 2014 -19 సంవత్సరంలో నిర్మాణం జరిగిన ఈ భవనాలను వైసిపి ప్రభుత్వం విస్మరించిందని పేర్కొన్నారు. మళ్లీ తిరిగి వాటిని తమ ప్రభుత్వమే పూర్తి చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని నరేంద్ర వర్మ అన్నారు.వచ్చే ఏడాది జూన్ నాటికి ఈ భవనాలను సిద్ధం చేస్తామని వెల్లడించారు.వాస్తవం ఇదైతే ఆ భవనాలను మీ ప్రభుత్వ హయాంలో ఎలా అభివృద్ధి చేశారో అర్థం కావడం లేదని నరేంద్ర వర్మ అన్నారు. ఆరోపణలు చేసే ముందు పూర్తిస్థాయి వాస్తవాలు ఉండాలన్నారు. ముఖ్యమంత్రి పర్యటనలో బాపట్ల అభివృద్ధికి ఎటువంటి భరోసా ఇవ్వలేదని కోన రఘుపతి అంటున్నారు. అది పూర్తిగా ప్రభుత్వ కార్యక్రమం. విద్యా వ్యవస్థను బలోపేతం చేసే ఏకైక కార్యక్రమం. ఇందులో వేరే అంశాలకు అవకాశం లేదు,అయినప్పటికీ బాపట్ల అభివృద్ధి కోసం, బాపట్ల మెడికల్ కళాశాల అవశ్యకతతో పాటు,35 అంశాలతో కూడిన వివిధ శాఖల వివరణలతో ముఖ్యమంత్రి చంద్రబాబుకు వినతి పత్రాలు అందజేయడం జరిగిందని తెలిపారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో బాపట్ల పర్యటనకు వచ్చిన అప్పటి ముఖ్యమంత్రి వైయస్ జగన్ సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ ఏమైందని నరేంద్ర వర్మ ప్రశ్నించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలో బాపట్ల అభివృద్ధి ఎలా ఉంటుందో చేసి చూపిస్తానని నరేంద్ర వర్మ అన్నారు.హామీలు ఇచ్చి అమలు చేయకుండా విస్మరించటం కూటమి ప్రభుత్వానికి చేతకాదు, భవిష్యత్తులో ఈ ప్రభుత్వ పనితీరు ఎలా ఉంటుందో ప్రజలే తెలుసుకుంటారని తెలిపారు. ఖచ్చితమైన వాస్తవాలు ఉంటేనే ఆరోపణలు చేయాలన్న విషయాన్ని కోన రఘుపతి తెలుసుకుంటే మంచిదన్నారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్ర వర్మ కృతజ్ఞతలు తెలిపారు.



# రెవిన్యూ సదస్సులు జయప్రదం అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలి

**- జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి**



**బాపట్ల – నవభూమి:** రెవిన్యూ సదస్సులు జయప్రదం అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు. పర్చూరు మండలంలో నిర్వహించే రెవెన్యూ సదస్సులపై సంబంధిత అధికారులతో సోమవారం స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ఆయన సమావేశం నిర్వహించారు. ప్రజల సమస్యలకు తక్షణమే పరిష్కార మార్గం చూపాలని కలెక్టర్ చెప్పారు. పర్చూరు మండలం చిననందిపాడు గ్రామంలో సోమవారం జరిగే రెవిన్యూ సదస్సుకు రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి ఆర్ పి సిసోడియ హాజరవుతారన్నారు. ఈ నేపద్యంలో రెవెన్యూ దస్తాలన్నీ సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. సదస్సు నిర్వహణలో ఎలాంటి సమస్యలు రాకుండా అధికారులు పక్కా ప్రణాళికతో చర్యలు తీసుకోవాలన్నారు. సర్వేకు సంబంధించిన దస్త్రాలన్నీ సిద్ధంగా ఉంచాలన్నారు. దేవాదాయశాఖ భూముల వివరాలు, అడంగల్లు, ఆర్ఎస్ఆర్ లు పక్కాగా ఉండాలన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను ఆన్ లైన్ లో నిక్షిప్తం చేయాలన్నారు. ఆ గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలన్నారు. సిసి రోడ్ల నిర్మాణం అవసరతన గుర్తించి, వాటిపై నివేదిక ఇవ్వాలన్నారు. మురికి నీటి వ్యవస్థ ఏర్పాటుపై చర్యలు తీసుకోవాలన్నారు. పి జి ఆర్ ఎస్ లో ఆ మండలం నుంచి పునరావృతమైన అర్జీలపై ఆరా తీశారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జి. గంగాధర్ గౌడ్, బాపట్ల ఆర్డీఓ పి.గ్లోరియా, కె ఆర్ ఆర్ సి ఎస్ డి సి లవన్న, అనుబంధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ డీలర్ పోస్టులకు నోటిఫికేషన్ జారీ



**మాడుగుల డిసెంబర్ 9 నవభూమి** మండలం లోని మూడు రేషన్ డీలర్ పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు స్థానిక తహసిల్దార్ కె. రమా దేవి సోమవారం తెలిపారు. మండలం లోని పోతన పూడి అగ్రహారం , జమ్మాదేవి పేట తో పాటు కొత్తగా గొప్పుర్లో కూడా రేషన్ డిపో ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. అభ్యర్థులు 40 లోపు వయస్సు కలిగి , కనీసం ఇంటర్మీడియట్ చదివి ఉండాలని ఆమె తెలిపారు .ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 13 తేది లోపు నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయం లో దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె తెలిపారు.

# పారిపోయిన టెన్తు విద్యార్థుల కథ సుఖాంతం

**తిరుపతి:** తల్లిదండ్రులు మందలించారని ఇంటి నుండి పారిపోయిన టెన్తు విధ్యార్థుల కథ సుఖాంతం అయింది. తిరుపతి నుంచి ధర్మవరం వైపు రైల్లో పారిపోతున్న ముగ్గురు విద్యార్థులను అన్నమయ్య జిల్లా ములకలచెరువు పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వారిచ్చిన సమాచారంతో ఈస్టు పోలీసులు తిరుపతికి తీసుకొచ్చారు. అర్ధరాత్రి తల్లిదండ్రులకు విద్యార్థులను పోలీసులు అప్పగించారు. తిరుపతి నగరంలో వరస మిస్సింగ్ కేసులు కలకలం రేపుతున్నాయి. పలు కారణాలతో అదృశ్యం అవుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. తల్లిదండ్రులు మందలించారని, భర్తతో గొడవ, కుటుంబ, ఆర్థిక సమస్యలు వంటి కారణాలతో ఇంటి నుంచి వెళ్లిపోతున్నారు. మరోవైపు కిడ్నాప్ కేసులు సైతం వెలుగు చూస్తున్నాయి. అయితే తాజాగా ఒకే రోజు ఆరుగురు ఇంటి నుంచి అదృశ్యం కావడం ఆందోళనకు గురి చేస్తోంది.

## సాయుధ దళాల పతాక నిధికి

# విరాళాన్ని అందించిన జిల్లా కలెక్టర్

- కలెక్టర్ డా. వినోద్ కుమార్, సత్యసాయి జిల్లా పుట్టపర్తి కలెక్టర్ టిఎస్ చేతన్
- మాజీ సైనికుల సంక్షేమానికోసం.. సాయుధ దళాల పతాక నిధికి ఉదారంగా విరాళాలను ఇవ్వండి
- జిల్లా సైనిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సాయుధ దళాల పతాక నిధికి ఉమ్మడి జిల్లాలో విరాళాల సేకరణ





**అనంతపురం/పుట్టపర్తి, డిసెంబర్ 09: నవభూమి** అనంతపురము కలెక్టర్ కార్యాలయం రెవెన్యూ భవన్లో జిల్లా కలెక్టర్ డా. వినోద్ కుమార్ ను కలిసి, పుష్పగుచ్ఛం, సాయుధ దళాల పతాక స్టిక్కర్ ను అందించి, విరాళాలను సేకరించిన ఉమ్మడి జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి పి. తిమ్మప్ప? మన దేశ రక్షణలో ప్రాణత్యాగం చేసిన సైనికుల కుటుంబాలకు, దేశ రక్షణ కోసం సరిహద్దుల్లో అహర్నిశలు విధులను నిర్వర్తిస్తున్న సైనికులకు మరియు మాజీ సైనికుల సంక్షేమానికోసం సాయుధ దళాల పతాక నిధికి అన్ని వర్గాల ప్రజలు ఉదారంగా, విరివిగా విరాళాలు అందించి ఉమ్మడి జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని, మాజీ సైనికులకు మన పౌర సమాజం అండగా ఉండాలని, చేయూత నివ్వాలని అనంతపురము జిల్లా కలెక్టర్ డా. వినోద్ కుమార్, శ్రీ సత్య సాయి పుట్టపర్తి జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ ఇరు జిల్లాల ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార దినోత్సవం నాడు ఉమ్మడి జిల్లా సైనిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అనంతపురం కలెక్టరేట్ రెవెన్యూ భవన్, శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి కలెక్టర్ కార్యాలయాలలో జిల్లా కలెక్టర్లను, జాయింట్ కలెక్టర్లను కలిసి, జిల్లా అధికారులతో సాయిధ దళాల పతాక నిధికి హుండీ బాక్స్ ల ద్వారా విరాళాలను సేకరించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని సైనిక సంక్షేమ శాఖ రూపొందించిన సాయిధ దళాల పతాక స్టిక్కర్లు, కార్ ఫ్లాగ్స్, కరపత్రాలను అన్ని వర్గాల ప్రజలకు, అధికారులకు ఉద్యోగులకు , దాతలకు సైనిక సంక్షేమ శాఖ అధికారి పీ.తిమ్మప్ప, సిబ్బంది, మాజీ సైనికులు, పంపిణీ చేసి హుండీ బాక్స్ ల ద్వారా విరాళాల్ని సేకరించి, దాతలకు కృతజ్ఞతలను తెలిపారు. అలాగే సాయుధ దళాల పతాక దినోత్సవం ప్రాధాన్యత, సైనిక సంక్షేమ నిధికి విరాళాల సేకరణ అంశాలపై జిల్లా సైనిక సంక్షేమ అధికారి తిమ్మప్ప ఈ సందర్భంగా అధికారులకు వివరించి విరాళాల సేకరణకు వారి సహకారాన్ని కోరారు. ఈ సందర్భంగా రెండు జిల్లాల కలెక్టర్లు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోని ప్రజలు సాయుధ దళాలలో పనిచేస్తున్న సైనికులకు సంఘీభావాన్ని ప్రకటించి మాజీ సైనికుల పునరావస కార్యక్రమంలో అమరులైన వీర జవాన్లకు, వితంతువులకు వారి కుటుంబ సభ్యులకు ఆదుకునే క్రమంలో ఉదారంగా ప్రజలు విరాళాలు అందించవలసిందిగా కోరారు. మన దేశ సాయుధ దళాలు యుద్ధ సమయంలోను, శాంతి సమయంలోను దృఢ సంకల్పము ఏకాగ్రతతో దేశసేవ చేస్తున్నారని, మాతృదేశం కొరకు అసువులు బాసిన వీర సైనికులు వారి వితంతువులు, కుటుంబ సభ్యులపై దేశ ప్రజల బాధ్యతను ఈ పతాక దినోత్సవం గుర్తు చేస్తుందని వారు పేర్కొన్నారు. ఆర్మీ, వైమానిక, నౌకాదళములకు చెందిన సైనికమిలు అహర్నిశలు దేశం సరిహద్దుల ద్వారా శత్రువులు మాతృభూమిలోకి చొరబడకుండా భూభాగాన్ని గగన తలాన్ని సముద్రతీరాలపై ఎంతో అప్రమత్తంగా ఉన్నుండి కాపాడుతున్నారని వారు తెలిపారు. ఎంతో ధైర్యముతో మాతృభూమికై తమ ప్రాణాలను అర్పించిన వీర జవాన్లకు భారతదేశ ప్రజలందరూ నివాళులు అర్పించే దినం సాయుధ దళాల దినోత్సవం అని వారు అన్నారు. ముఖ్యంగా దేశంలో ఆయా ప్రాంతాలలో ప్రకృతి వైపరీత్యా సంభవించే వరదలు, భూకంపాలు, తుఫానులు వాటిలినప్పుడు మరణానికి సైతం వెనకాడకుండా సైనిక దళాలు చేపట్టిన సహాయ కార్యక్రమాలుదేశప్రజల మన్ననలను, అభిమానాన్ని చూర గొంటున్నాయని తెలిపారు. దేశ సేవలో భాగంగా సైనిక దళాలుచేస్తున్న సేవలు అభినందనీయం, చిరస్మరణీయం అని అభివర్ణించారు. సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని పురస్కరించుకొని మాజీ సైనికులు మరియు యుద్ధ సమయంలో మరణించిన వారి వారసుల సంక్షేమం కొరకు జిల్లాలోని ఎన్.సి. సి మరియు ఎన్ఎస్ఎస్ విద్యార్థులు హుండీ ద్వారా ప్రజల నుండి విరాళాలను సేకరించి స్టిక్కర్లను, కార్ ఫ్లాగ్స్ ఆయా ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు పంపి వాటి అమ్మకం ద్వారా వచ్చిన ఆదాయమును విరాళముగా స్వీకరించి కేంద్రీయ సైనిక్ బోర్డ్, రాజ్య సైనిక్ బోర్డు లకు విరాళాలను పంపి వారి ద్వారా సైనిక సంక్షేమం కోసం విరాళాలను ఖర్చు చేస్తారని వారు తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు వారి విరాళాలను జిల్లా సైనిక సంక్షేమ శాఖ ఎస్.బి.ఐ ఖాతా నెం. 62076956433 ఐ.ఎఫ్.ఎస్.సి. కోడ్. %హదీ×చీ% 0021438 ద్వారా కూడా విరాళాలను అందించవచ్చునని , ఇన్కమ్ ట్యాక్స్ మినహాయింపు పొందవచ్చని ఇరు జిల్లాల కలెక్టర్లు తెలిపారు. ఇరు జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్, డి ఆర్ ఓ లు , జిల్లా అధికారులు హుండీ బాక్స్ ల ద్వారా విరాళాల్ని అందించగా, ప్రత్యేకంగా జిల్లా సైనిక సంక్షేమ అధికారి పి. తిమ్మప్ప ఐదు వేల రూపాయల విరాళాన్ని, జిల్లా కో ఆపరేటివ్, అధికారి అరుణ ఐదు వేల రూపాయలను, ఐసీడీఎస్ పీడీ డా. బి ఎన్ శ్రీదేవి ఐదు వేల రూపాయల విరాళాన్ని అందించారు. అనంతపురం కలెక్టరేట్ నుండి ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తో పాటు, జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, ఇంచార్జ్ డి ఆర్ ఓ తిప్పే నాయక్, జిల్లా సైనిక సంక్షేమ అధికారి తిమ్మప్ప, సిబ్బంది బాబా ఫక్రుద్దీన్, అనిల్,మాజీ సైనికులు అమర్నాథ్ లాల్, రామ్ కుమార్, హుసేన్ , అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. పుట్టపర్తి కలెక్టర్ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డి ఆర్ ఓ విజయ సారథి ల నుండి యూపీఐ స్కాన్ పే ద్వారా , జిల్లా అధికారుల నుండి హుండీ బాక్స్ ద్వారా జిల్లా సైనిక సంక్షేమ శాఖ సిబ్బంది గిరీష్, మాజీ సైనికులు విరాళాన్ని సేకరించారు.

## ఎంఎస్ఎంఈతో నిరుద్యోగులకు ఉపాధి కల్పన



**రామచంద్రపురం –నవభూమి:** నిరుద్యోగులకు సూక్ష్మ, మధ్య, చిన్నతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) ద్వారా ఉపాధి అవకాశాల కల్పిస్తున్నామని రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. శ్రీకరి ఇన్నోవేషన్స్ అండ్ ఇంప్లిమెంటేషన్ కంపెనీలో పరీక్ష ఆధారంగా ఉత్తీర్ణులైన గ్రూపు ఫెసిలిటేటర్స్‌కు ఆదివారం మంత్రి సేఫ్టీ సిలెండర్లు పంపిణీ చేశారు. మంత్రి మాట్లాడుతూ ఫెసిలిటేటర్లుగా ఎంపికైన వారు ఎంఎస్ఎంఈ పరిశ్రమల్లో పలు అంశాలపై తనిఖీ చేసి క్వాలిటీ కంట్రోల్ ఆఫ్ ఇండియాకు నివేదిక పంపిస్తారన్నారు. నిరంతర తనిఖీల ద్వారా పరిశ్రమల్లో ప్రమాదాలు జరగకుండా ముందస్తు నివారణ చేయవచ్చని అన్నారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజరు పీకేపీ ప్రసాద్, శ్రీకరి ఇన్నోవేషన్స్ మేనేజింగ్ డైరెక్టరు టీవీఎస్ వినోద్‌కుమార్, ప్రాజెక్టు ఇన్‌చార్జి సయ్యద్ చాన్‌బాబు, ప్రాజెక్టు మేనేజర్లు హేమంత్‌కుమార్, రాచూరి వెంకటేష్, అడ్మిన్ సాగర్ పాల్గొన్నారు.ఎన్ఎంఎంఎస్ పరీక్ష ప్రశాంతం రామచంద్రపురం పట్టణంలో ఆదివారం ఎన్ఎంఎంఎస్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. రామచంద్రపురం డివిజన్‌లో 712 మంది విద్యార్థులకు 697 మంది హాజరయ్యారు. రత్నంపేట మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 235 మంది, చింతపల్లి సూరన్ననగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 229 మంది, కృత్తివెంటి పేర్రాజు పంతుల ప్రభుత్వ జాతీయోన్నత పాఠశాలలో 233 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యా రు. పరీక్ష కేంద్రాలను ఏఎంవో పి.రాంబాబు, ఎంఈవో ఎం.శ్రీనివాస్ పర్యవేక్షించారు.

## బిక్కవోలులో కనుల పండువగా రథోత్సవం

**బిక్కవోలు, –నవభూమి:** తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలు శ్రీకుమారసుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారి రథోత్సం కనుల పండువగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోఛ్ఛారణలు, బ్యాండు మేళాల మధ్య ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతులు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పల్లి శ్రీనివాసరెడ్డి రథాన్ని లాగి ఉత్సవాన్ని ప్రారంభించారు. రథం ముందు బిక్కవోలు శ్రీకుమారసుబ్రహ్మణ్యస్వామి కోలాట మండలి సభ్యుల కోలాటం, బ్యాండ్ కచేరిలు, కేరళ వాయిద్యాలు అందర్నీ అలరించాయి. స్వామివారి రథం వంగా వారి వీధి నుంచి మెయిన్‌రోడ్ మీదుగా రాజారావుపేట, గ్రామంలోని పురవీధుల గుండా సాగింది. అధిక సంఖ్యలో భక్తులు రథాన్ని లాగడానికి పోటీపడ్డారు. కార్యక్రమంలో లక్ష్మీగణపతి ఆలయ చైర్మన్ చాగంటి సాయిబాబారెడ్డి, కమిటీ సభ్యులు పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, వంగా పుల్లా రెడ్డి, తొండాపు శ్రీనివాసరెడ్డి, మానుకొండ రాంబాబు, నందిపాటి కిషోర్‌రెడ్డి, గొర్రెల త్రిమూర్తులు, పల్లి రాజారె డ్డి, కొమ్మోజు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అనపర్తి సీఐ సుమంత్ ఆధ్వర్యంలో పోలీసులు రథం చుట్టూ బందోబస్తు నిర్వహించారు.బాణసంచా కాల్పులు, గ్రామోత్సవం షష్ఠి ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి నిర్వహించిన శ్రీకుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి గ్రామోత్సవం, బాణసంచా కాల్పులు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. గ్రామోత్సవంలో తీన్‌మార్, బ్యాండ్ కచేరీలు, నెమలి నాట్యాలు, నవదుర్గలు కనువిందు చేశారు. అలాగే బిక్కవోలు ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బాణసంచా కాల్చివేత అందర్నీ మంత్ర ముగ్ధులను చేసింది. ఈతచెట్టు, మల్లెపందిరి, నిప్పులు వెదజల్లే షా ట్‌లు, రంగురంగుల కాంతులిచ్చే బిగ్ షాట్‌లు, నిప్పురవ్వలు విడుస్తూ వెళ్లే రాకెట్‌లు కాల్చారు.




### నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించిన భూముల దస్త్రాలన్నీ

# అధికారులు పునఃపరిశీలన చేయాలి

### జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి



**బాపట్ల – నవభూమి :** నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించిన భూముల దస్త్రాలన్నీ అధికారులు పునఃపరిశీలన చేయాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి ఆదేశించారు. రెవెన్యూ అంశాలపై ఆర్డీవోలు, తహసిల్దార్లతో సమీక్ష సమావేశం సోమవారం స్థానిక కలెక్టరేట్ లో ఆయన నిర్వహించారు. నిషేధిత భూముల జాబితా నుంచి 3,034 ఎకరాలు తొలగించగా ఇప్పటివరకు 2,500 ఎకరాలను పరిశీలించినట్లు కలెక్టర్ చెప్పారు. మూడు రోజుల్లో పరిశీలన ప్రక్రియ ముగించాలన్నారు. చుక్కల భూమి 4,981 ఎకరాలు ఉండగా, పరిశీలన ప్రక్రియ సత్వరమే చేపట్టాలన్నారు. రీ సర్వే సదస్సుల వచ్చిన పీజీఆర్ఎస్ అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యతతో పరిష్కరించాలని చెప్పారు. 8 మండలాలలో అర్జీలు పెండింగ్ లో ఉండడంపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. అర్జీలు పునరావృతం అవుతుంటే అధికారులు పట్టించుకోకపోవడం ఏమిటని నిలదీశారు. రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా ఉండరాదని హెచ్చరించారు. ప్రతి సోమవారం పి జి ఆర్ ఎస్ కార్యక్రమం అన్ని మండల కేంద్రాలలో జరగాలన్నారు. అన్ని శాఖలకు చెందిన అధికారులు విధిగా హాజరు కావాలని ఆయన స్పష్టం చేశారు.భారీ వర్షాల హెచ్చరిక నేపథ్యంలో ఈనెల 10, 11, 12 తేదీలలో వరి పంట కోతలు నిలిపివేయాలని కలెక్టర్ ఆదేశించారు. వరి కోత యంత్రాలు నడపరాదని, ఈ మూడు రోజులలో యంత్రాలు నడిపితే వాటిని స్వాధీనం చేసుకోవాలన్నారు. రైతులకు ఎలాంటి పంటనష్టం జరగకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.నీటి సంఘాల ఎన్నికలకు ఈనెల 11వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. 14వ తేదీన టీసీలకు ఎన్నికలు జరుగుతాయని, 17వ తేదీన డిస్ట్రిబ్యూటరీ కమిటీకి ఎన్నికలు నిర్వహించాలన్నారు. సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితా విడుదల కొరకు పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను తక్షణమే విచారణ పూర్తి చేయాలన్నారు. ఆధార్ కార్డులు లేనివారు 2,850 మందిని గుర్తించగా, ప్రత్యేక డ్రైవ్ ద్వారా 1,970 మందికి ఆధార్ ఇవ్వడంపై సమీక్షించారు. మిగిలినవి త్వరలో పూర్తి చేయాలన్నారు. ఆధార్ కార్డులు వచ్చిన వారికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వర్తింపజేయాలని సూచించారు. రెవిన్యూ సమస్యలు, భూ వివాదాలు లేని గ్రామంగా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ వెంకట మురళి చెప్పారు. రెవిన్యూ సదస్సులను సమర్థంగా నిర్వహించాలని ఆయన ఆదేశించారు. ఏ గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నారో ఆ గ్రామంలోనే రాజకీయ నాయకులు, రైతు సంఘాలు, రైతు ఉత్పత్తి సంఘాలు, ఎన్జీవోలను కలుపుకుని ముందస్తుగా విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఆర్ ఎస్ ఆర్, వెబ్ ల్యాండ్ రికార్డ్స్, అడంగల్, వన్ బి, ఆర్ ఎస్ ఏ, బేసిక్ రికార్డులను ఖచ్చితంగా ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రజల భాగస్వామ్యంతో జనవరి 8వ తేదీ వరకు సమర్థంగా సదస్సులు నిర్వహించాలన్నారు. గ్రామానికి సంబంధించిన మ్యాప్ లు ప్రతి గ్రామంలో ప్రచార బోర్డులలో ప్రదర్శనగా ఉంచాలన్నారు. నీటి తీరువా పన్నులు లక్ష్యం మేరకు వసూలు చేయాలని కలెక్టర్ తెలిపారు. భూమి సాగుదారుల నుంచి రూ.13.45 కోట్లు డిమాండ్ ఉండగా వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వీఆర్వోల ద్వారా వసూలు ప్రక్రియ వేగంగా చేపట్టాలని, ఇందుకోసం తహసిల్దార్లు రైతులను చైతన్య పరచాలన్నారు. ఆర్డీవోల పర్యవేక్షణ నిరంతరం ఉండాలని ఆదేశించారు. అభివృద్ధిని కాంక్షిస్తూ పరిశ్రమల ఏర్పాటు కొరకు ప్రభుత్వ భూములు కేటాయించిన వాటిని పరిశీలించాలన్నారు. ఏ ఉద్దేశంతో కేటాయింపులు జరిగాయో, క్షేత్రస్థాయిలో వాటి వినియోగంపై నిబంధనలు ఉల్లంఘిస్తే సదరు భూమిని తిరిగి తీసుకోవాలని స్పష్టం చేశారు. రెవిన్యూకు సంబంధించిన జీవోలపై తహసిల్దార్లకు అవగాహన లేకపోవడంపై కలెక్టర్ మండిపడ్డారు. మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ లుగా ఉన్న అధికారులకు కనీసం అవగాహన లేకపోతే ఎలా పని చేస్తారని మందలించారు. జిల్లా వ్యాప్తంగా 35 సినిమా థియేటర్లు ఉండగా, కేవలం 16 థియేటర్లకే లైసెన్స్ ఉండడంపై ఆరా తీశారు. తక్షణమే నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. పది రోజులలో తాసిల్దార్ల పనితీరులో పురోగతి కనిపించాలని సుధీర్ఘంగా సమీక్షించిన కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్ బాపట్ల, రేపల్లె ఆర్డీవోలు పి.గ్లోరియా, రామలక్ష్మి, కె ఆర్ ఆర్ సి ఎస్ డి సి లవన్న, కలెక్టరేట్ ఏవో సీతారత్నం, మండల తహసిల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఇష్టపడి చదవాలి

**ఓర్వకల్లు, –నవభూమి:** విద్యార్థులు ఇష్టంతో చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని ఎమ్మెల్యే గౌరు చరిత తనయుడు గౌరు జనార్దన రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన ఓర్వకల్లులోని ఎస్సీ బాలికల వసతి గృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి గౌరు జనార్దన రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎస్సీ బాలికల, బాలుర వసతి గృహాల విద్యార్థులకు గౌరు జనార్దనరెడ్డి, డాక్టర్ సునీల్ కుమార్ రెడ్డి, నారాయణ కాలేజీ అధికారి గోవర్ధనరెడ్డిలు ప్లేట్లు, గ్లాసులు, ఫ్యాన్లు, పెన్నుల పంపిణీ చేశారు. అలాగే నారాయణ విద్యాసంస్థల ఆధ్వర్యంలో గౌరు జనార్దన రెడ్డి పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జనార్దన రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. వసతి గృహాల సంక్షేమానికి దాతలు ముం దుకు వచ్చి సహకరించాలన్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించే విద్యార్థులకు దాతల సహకారంతో నగదును అందజేస్తామ న్నారు. కార్యక్ర మంలో రిటైర్డ్ హెచడబ్లూవో దొరస్వామి, టీడీపీ మండల కన్వీనర్ గోవింద రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు మోహన రెడ్డి, వాణిజ్య విభాగం అధ్యక్షుడు బ్రాహ్మణపల్లి నాగిరెడ్డి, నాయకులు రాంభూపాల్‌రెడ్డి, అన్వర్‌బాషా, ఏసేపు, అల్లాబాబు, అబ్దుల్లా, అయూబ్ బాషా, వేణుగోపాల్ రెడ్డి, నాగేశ్వరరెడ్డి, హెచడబ్లూవోలు ప్రమీలారాణి, సుంకన్న, శోభనబాబు, వైద్యులు సూర్య, వ్యాయామ ఉపాధ్యా యులు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

